మినవప్పు కు ఈత్రంగా కడిగి రోటిముందు పీటవాల్చుకొని కూర్చొని యాంత్రికంగా పప్పును రోటిలో వేసింది కామాక్షి. అదే సమయానికి ప్రక్కనే ఉన్న తన పుట్టింట్లోంచి తండ్రి, తల్లిపై మండిపడుతూ వేస్తున్న కేకలూ మధ్యమధ్యలో గ్లాసులు, గిన్నెలూ విసురుతూన్న శబ్దాలు విన్పిస్తున్నాయి. ఎప్పుడూ జరిగే సంఘటనే అయినా, మనసుని సమాధాన పరచుకోలేక, బాహ్యంగా చేతులు పప్పు రుబ్బుతున్నా చెవులుమటుకు ఆ సంఘర్షణని వినలేక వింటున్నాయి. 'ఇది పచ్చడిటే, పచ్చడా అని! ఇలాచేస్తే ఏ గాడిద కొడుకు తింటాడే...? కళ్ళు నెత్తిమీది కొచ్చి, ఎదుట ఉన్న నేనుకూడ కన్పించడం లేదే నీకు. నేనసలీ ఇంట్లో ఉండాలనుందా నీకు...ఇంటికి తగలడగానే వెధవమొహం వేసుకొని ఉప్పులేని వంటకాలు పెట్టడమూ, తిరిగి ఏమైనా అంటే ఏడుపులూను! ఛీ, ఛీ! పాడుకొంప శని మొహం!' ఇంకా ఏవేవో అంటూ ఆయుధాన్ని ప్రయోగిస్తున్నాడు. కామాక్షి ఇంక వినలేక చెవులు మూసు



# శని

శ్రీమతి ఎస్. మంజుల

కొని, వస్తున్న కన్నీళ్ళను బలవంతగా దిగమింగు కొంది.

ఎంత వద్దనుకొంటున్నా ప్రొద్దుటి సంఘటనే మనసులో మెదలుతోంది కామాక్షికి. ఇన్నాళ్ళూగాలేని ఈ కొత్త కొత్త ఆలోచనలు, విప్లవ భావాలూ తనకి ఎక్కడనుంచి, ఏ విధంగా వస్తున్నాయి? ఇది విప్లవ భావమా లేక, ఎన్నాళ్ళనుండో అణగారిఉన్న స్వార్థ పరాయణత్వమా లేక వయసులోని కొత్త దనమా తనకీ ఆలోచనల్ని వృద్ధి పరుస్తున్నది? ఎడతెగని, అర్థంలేని ఆలోచనలతో కామాక్షి మనసు విసిగి పోయింది. ఈ ఆలోచనలకి మూలంకాని, ఫలితంకాని స్వార్థం కాకూడదనుకొంది. ఏదో చెయ్యాలనే తపన, ఎవరిమీదనో కసి ఒక్కుమ్మడిగా విజృంభిస్తున్నాయి తనలో! అన్నిటికీ కారణం ఏమిటి, కారణం ఏమిటని మనసు పదేపదే ఘోషిస్తోంది. అర్థరాత్రి దాటింది. ఊరంతా స్వప్న జగత్తులో విహరిస్తోంది.

ఆలోచన లన్నిటినీ ప్రక్కకునెట్టి ఒక్కసారి తనచుట్టూరా కలయజూచింది కామాక్షి. గదిలో ఒకమూల కుక్కి మంచంమీద చిక్కి శల్యమై పడిఉన్న మామగారు, మంచానికి ప్రక్కగా క్రిందనే చింకి చాప పరచుకొని హాయిగా గుర్రు పెడుతూ నిద్రపోతున్న అత్తగారూ దృష్టిలోకి వచ్చారు. వెంటనే వారి స్థానంలోనే అమ్మని, నాన్నని ఊహించుకొంది కామాక్షి.

'హాఁ! అమ్మ...!' అని వేడిగా నిట్టూర్పు విడుస్తూ బాధగా, జాలిగా అమ్మని తల్చుకొంది. కష్టాలకి దుఃఖాలకీ మారుపేరు తనఅమ్మ! ఆరోజుల్లో ఆడపిల్లలకు పదేళ్ళు నిండకముందే పెళ్ళిచేసి, అత్తవారి ఇళ్ళకి సాగనంపి, తమ గుండెలమీద కుంపటిని దింపుకున్నామని హాయిగా ని(ని)శ్వసిస్తూండేవారు పిల్లగలవారు. అలాగే, అమ్మకికూడ ఆరవఏటనే పెళ్ళి వైభవంగా జరిపించారు తాత. అమ్మమ్మపోయి అప్పటికి ఏడాది దాటిందట. నాయనమ్మ తల్లిలేని పిల్లయిన అమ్మనుచూసి జాలిపడి, పెళ్ళయి ఏడాది దాటకుండానే కోరి తన ఇంటికి తెచ్చుకొందిట. అంటే అమ్మ ఏడవఏటనే అత్తవారింటికి వచ్చేసింది. నాయనమ్మ అమ్మను తన స్వంత బిడ్డలాగ చూసుకొనేదిట. అమ్మ చెప్తుండేది, 'కామూ, నేను పుట్టిబుద్ధెరిగాక, నాకు కలిగినవి రెండే రెండు అదృష్టాలే. అవేమిటో చెప్పనా, మొదటిదేమో, దేవతనిమించిన అత్తగారు నాకు లభించడం, ఇక రెండోది, సుగుణాలపుట్ట. నా ముద్దులతల్లి నువ్వేనమ్మా నా రెండో అదృష్టం.' అంటూనే కంట తడిపెట్టి 'పుట్టినప్పట్నుంచీ నా జీవితం ఒకే విధంగా గడచిపోతోంది. నీ మంచి మనసుతో నువ్వు మెట్టినింటిని స్వర్గంగా మార్చగలవు. నాకు నీమీద ఆ నమ్మకంవుంది. నా తల్లి బంగారం కొండ. నా తల్లిని చేసుకోడానికి ఏ రాజ కుమారుడు తపస్సు చేస్తున్నాడో.' అని గట్టిగా ప్రేమతో తనని గుండెల కదుముకొనేది అమ్మ. చాలు! ఆ వెచ్చని ప్రేమనిండిన ఆ నిండైన తీయని అనుభూతి చాలు! జీవితంలో తాను పొందగలిగిన అదృష్టం ఒక్కటే. అదే. తల్లిప్రేమ! అమృతమూర్తి అమ్మ నాన్న ఇనుపకాళ్ళక్రింద అమాయకంగా అణగత్రొక్కబడి పోతోంది. నిర్దాక్షిణ్యంగా పువ్వువంటి అమ్మను తన ఇనపచేతులతో నలిపివేస్తున్నాడు నాన్న! ఐనా అమ్మమనసు వాడలేదు, నలిగి పోలేదు. స్త్రీలో మూర్తీభవించిన సహనమంతటితో దేవుడు అమ్మని తయారు చేశాడు. నాన్న అంటే అమ్మకి తగని భయం. ఆ భయంలో ద్వేషంకాని, పగకాని ఇసుమంతైనా లేవు భక్తితో కూడిన భయం అది! తనిన్నాళ్ళూ జీవించింది అంటే ఒక్క అమ్మని కళ్ళారా రోజుకోసారి చూడగల్గుతానన్న ఆశతో, అమ్మ మనస్సు క్షోభపెట్టక, అమ్మకి ఈ మాత్రపు తృప్తినైనా మిగుల్చుదామనే కోరికతో మాత్రమే.

కామాక్షికి గడచిన తన చిన్నతనపు రోజులు ఒక్కటొక్కటే జ్ఞాపకం వస్తున్నాయి. కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరుగుతూంటే గతాన్ని నెమరువేస్తోంది కామాక్షి మనసు.

— తనకి ఎనిమిదేళ్ళప్పుడు...! అంటే, పదిహేడేళ్ళక్రితం! ఆ రోజు...పొలం నుండి హడావిడి పడుతూ వస్తున్న నాన్నను చూసి, భయం భయంగా తలుపుచాటున దాక్కొంది తను! 'ఏమేవ్, వినవే! ఆ దేవుడి గదిలో భోషాణంలో నా పంచె లుంటాయి. ఓ రెండిలా తెచ్చి ఈ సంచిలో పెట్టు. ఆఁ! చూరులో పెట్టుకొన్న పంచాంగం, చిలకకొయ్యకి వ్రేలాడుతున్న ఉత్తరీయం, అన్ని తెచ్చి ఇందులో సర్దు. నేను ఓ రెండు నెలలపాటు అలా యాత్రలు చేసి వస్తాను. పట్నంలో నాకు తెల్సినవాళ్ళు చాలామంది వెళ్తున్నారు.' అని అతి సామాన్యంగా పొరుగూరికి వెళ్ళి ఓ గంటలో తిరిగి వచ్చేస్తున్నట్టు చెప్పేడు నాన్న. ఆ మాటలు వినగానే తనకెంతో సంతోషం వేసింది. 'హమ్మయ్య! నాన్న మరి కొన్నాళ్ళ వరకు ఇంట్లో ఉండడు' అనుకొని హాయిగా ఊపిరి పీల్చింది తను. అమ్మ కళ్ళలో వస్తున్న నీళ్ళు దాచుకోడానికి శతవిధాల ప్రయత్నం చేసినా, ఫలించక నాన్న చేతిలో రెండుచెంప దెబ్బలుతింది. రెండునెలలకి తిరిగి వస్తానన్న నాన్న ఆర్నెల్లవరకు రానేలేదు. నాన్న ఏమయ్యాడోనని అమ్మకి ఒకటే బెంగ! తనుమటుకు ఆ ఆరునెలలు పంజరం విడచిన పక్షిలా వీధివీధి తిరిగి, ఎందరినో స్నేహితుల్ని సంపాదించుకొని, ఎక్కడా లేని స్వేచ్ఛనూ సంపాదించింది. అమ్మ ఆరునెలల్లోనూ తనకు ఎన్నోకథలు, పాటలు, పనులు అన్నీ నేర్పింది. తాను ఇంచుమించు నాన్నని మరచిపోయే సమయానికి చిరిగిన గుడ్డలతో, పెరిగిన గడ్డంతో పిచ్చివాడిలా ఇంటికి తిరిగి వచ్చాడు నాన్న. వెంటనే మళ్ళీ ఇల్లు చెరసాలయ్యింది తనకు. నాన్నకు తనంటే విపరీతమైన అసహ్యం! తను పుట్టగానే తన మేనత్త చనిపోయిందని, తాను పుట్టి ఆమెని చంపేసిందని నాన్న నమ్మకం. తెల్సినవారేక తను ఎదురుపడితే, 'ఛీ, ఛీ!' అంటూండేవాడు. చిన్నతనంలో తెలియక ఓసారి తను నాన్న ఒడిలో కూర్చోబోయింది. అంతే! ఆ రోజు ఒళ్ళు వాచేలా బాదేడు తనను. అయినా, పెళ్ళైనంతవరకు నాన్నని తప్పించుకొని

# బలి

తిరగాలన్పించేది తనకు! తన్ను చాటుగా ఎంత ముద్దాడినా, నాన్న ఎదుట తన్ను వెనకేసుకు వచ్చేటంత ధైర్యం అమ్మలో అణగారిపోయింది. ఒకటి రెండుసార్లు నా పక్షం మాట్లాడిన అమ్మను, తన ఎదుటే పశువును బాదినట్లు బాదగానే, మొట్టమొదటిసారిగా నాన్నంటే అంతు లేని అసహ్యం, అమ్మ మీద జాలి ప్రేమ పుట్టుకొచ్చాయి.

రోజులు, వారాలు గడచిపోయాయి. ఋతువులు మారుతున్నాయి. కాని నాన్నలో మార్పు ఏమీ లేదు. ప్రతిరోజూ, అమ్మ చేసిన వంటలో లేని లోపాలని వేలెత్తి చూపించి అమ్మని తిట్టడం, కొట్టడం, అదే తీరున అమ్మ వాటిని సహించడం అలవాటైన దినచర్య అయిపోయింది. అమ్మ సాహసించి ఏదైనా ఒక్క మాట, పొలాల గురించి కాని, ఇంటి విషయంకాని కదిపితే, తారాజువ్వలా మండిపడుతూ లేచి, వీధిలో నలుగురు పెద్దలని చేరవేసి న్యాయా న్యాయాల తీర్పు నడుగుతూండడం, ప్రతి చిన్న విషయాన్ని గోరంతలు కొండంతలుగాచేసి ఇంటి విషయాన్ని రచ్చకెక్కిస్తూండడం చిన్నతనంనుండీ చూసి బాధపడటం తను అలవాటు చేసుకొంది. అది ఒకరకమైన తెలివితక్కువతనమైతేనేమి, అమాయకత్వమైతేనేమి, ఊరివారికందరికీ తన నాన్న చులకనైపోయేడు. తమ తమ అవసరాలకి నాన్నవద్ద చేరి ఓ గంటసేపు నాన్నను నాన్న వంశంలో పెద్దవారిని స్తుతించి, నాన్నని అమాయకుణ్నిచేసి మోసం చేస్తున్నారు. రైతులు కూడ చివరికి శిస్తులు సరిగ్గా ఇవ్వటం మానేశారు. ఇంక మరి సంతానం బెడద లేనందువల్ల అమ్మకి, నాన్నకి తిండికి లోపమేమీ జరగలేదు. ఇప్పటివరకూ ఇలా ఎన్నాళ్ళు సాగుతుంది...?

ఊరి పెద్దల సలహా ఏ నిముషాన ఎలా ఫలించిందో కాని, ఉన్న ఆరు ఎకరాల మాగాణిలో రెండెకరాల పొలం వరకట్నంగా ఇచ్చి ప్రక్క ఇంట్లోఉన్న యజ్ఞన్నశాస్త్రి ఏకైక పుత్రుడు దేముళ్ళుకి తనని ఇచ్చి తన పన్నెండో ఏటనే వివాహం జరిపించాడు. పెళ్ళిలో ఏవో లాంఛనాలంటూ గునిసిన ఆడపడుచులు, అలకపానుపంటూన్న అత్తగారు వారి కోరికలు తీరనందున ఆ కోపమంతా ఆ క్షణంనుండీ ఈ క్షణం వరకు తన మీద చూపెడుతున్నారు. ఉద్రేకం ఎక్కువయి, నోరు జారడంవల్ల నాన్నపై మామగారికి కోపం వచ్చి, 'ఇంక మీకు, మీ పిల్లకి ఈ నిమిషం నుంచీ సమ్మంధం లేదు. ఏదో మర్యాదస్తుణ్ణి గనక పిల్లని తీసుకు వెడుతున్నాం.' అంటూ పెళ్ళి పందిరిలో తన రెక్క పుచ్చుకొని వాళ్ళింటికి లాక్కు వెళ్ళారు. విధిలేక, అమ్మకోసం, వెనక్కి వెనక్కి చూస్తూ ఈ ఇంట్లో వచ్చి పడింది తను. వచ్చినది మొదలు, ఇంత వరకు తాను తిరిగి వీధి వైపు చూడలేదు. అదంతా అత్తగారి ద్వారా మామగారి శాసనం. నాన్నకూ, మామగారికీ ఏమీ తేడా కన్పించలేదు తనకి.

తెల్లవారింది మొదలు, ప్రొద్దుపోయే వరకు చాటుమాటున ఉండి తాను సేవలు చేయాల్సిందే! కాని, కంటబడితే మాత్రం, గుప్తంగా దాచుకొన్న మూడో కన్ను అమాంతంగా నిప్పులుకురిపిస్తుంది. కోడలు వచ్చేకనైన కొడుకులో మార్పు వస్తుందేమోనన్న ఆశ, అత్త మామ గార్లలో ఉండటం వల్ల కొన్నాళ్ళు తాను ఆ ఇంట్లో ఒక మనిషిగా బ్రతక గలిగింది. కాని, ఆ దేశ నిరాశ అయి, కోడలి పాద మహిమలో లేనిపోని శంకలను పెట్టుకొని, కోడలి వల్లనే తమ ఏకైక పుత్రుడు ఎవ్వరితో చెప్పా పెట్టకుండ ఊరు వదలి పారిపోయాడని గట్టి నమ్మకంతో నూటిపోటి మాటలతో తన మనసు గాయపరిచేవారు. కాని విషం వంటి నిజం, నిప్పులాంటి నిజం గుండెల్లో దాచుకొని, పైపై అవమానాలను భరించేంత మనసు కలదాన్నని ఎవ్వరూ అర్థం చేసుకోలేదు.

పెళ్ళయిన రెండేళ్ళ వరకు భర్త ముఖాన్ని చూడటానికి కూడ అవకాశం రాలేదు తనకి. పెళ్ళితంతు పూర్తవగానే తన భర్త పట్నం వెళ్ళిపోయాడు. ఎందుకు వెళ్ళాడో ఏమిటో తనకి అప్పట్లో తెలుసుకోవాలన్పించలేదు కూడ! తర్వాత తెల్సింది పట్నంలో చదువుకొంటున్నాడని! రెండేళ్ళ తర్వాత ఒకనాడు ఎడ్లబండిలోంచి, సూటు, బూటు, టోపీతో ఒక వ్యక్తి దిగడం, అత్తగారు మామగార్ల పలకరింపులను బట్టి అతనే తన భర్త అని తాను గుర్తించడం జరిగింది. మూడు రోజుల తర్వాత ఒకనాడు రాత్రి, అలవాటు ప్రకారం పనుల్నీ ముగించుకొని వచ్చి పెరటి వరండాలో చాప వేసుకొని పడుకొంది. గదిలో అత్తగారు, మామగారు ఏవేవో మంతనాలు జరుపుకొంటున్నారు. తనకి బాగా అలసటగా ఉన్నందువల్ల చాలా తొందరగా నిద్ర పట్టింది. సగం నిద్రలో ఎవరో లేపుతున్నట్లనిపించి, ఒక్కసారి త్రుళ్ళిపడి లేచింది. అత్తగారు తన చెయ్యి పట్టుకొని, గదిలోకి తీసుకు వెళ్ళి, 'ఇవాళ్టికి ఇక్కడ పడుకో' అని శాసించినట్లు చెప్పి వెళ్ళిపోయింది. నిద్రమత్తులో చాప తెచ్చుకు వేసుకొని, గదిలోనే నిద్ర పోయింది. కోడి కూత వినగానే తెలివి వచ్చి లేచేసరికి ఒకే గదిలో మంచం మీద తన భర్త నిద్ర పోతూ కన్పించేడు. భయంగా గాభరాగా లేచి వెళ్ళి ముఖం కడుక్కొని, తిరిగి దిన చర్య ప్రారంభించింది. ఆ మర్నాడే అతను ఊరికి వెళ్ళిపోయాడు. ఆ రోజు నుంచి లోకం దృష్టిలో తను మరొక మెట్టు పెద్దదైంది. ఇది జరిగి ఇప్పటికి పదకొండేళ్ళయింది. ఇంతవరకు తిరిగి తన భర్త రానేలేదు. పట్నంలో నౌకరు చేస్తూ, ఏ మూల ఉన్నాడో తెలియు లేదు. ఈ పదేళ్ళలో తను అనుభవించిన పాట్లకి లెక్కలేదు.

ఏ ప్రత్యేకతా లేని తన బ్రతుకుపై తనకే విరక్తి పుట్టింది. అమ్మ దృష్టిలో ఉండుకొని, అత్తగారింట తన బాధ్యతలన్నీ మర్యాదకారంగా నిర్వహిస్తుంటే, తన దుఃఖాన్ని స్వభావంగా అర్థం చేసుకోలేక, పరోక్షంగా ఎన్నో నిందలు మోపడమే కాక, తెల్లవారింది మొదలు ప్రొద్దుపోయే వరకు ఎదిరింపులతోను, దూషణ ఛీత్కారాలతో సత్కరిస్తూనే ఉంటారు. తనంటే ఎందుకు అంత లోకువ అందరికీ? తనేం పాపం చేసింది...? తాను పుట్టడమే ఒక మహా

హీనంగా పరిగణింపబడుతోందే నాన్న దృష్టిలో...? ఒక్కనాడైనా నాన్న ఎదుట ధైర్యంగా నిలబడలేదే తను ...! ఎందుకు లోకమంతా తన్నిలా వ్రేలెత్తి చూపిస్తోంది?

నాన్న ఆనాడు తీర్థయాత్రలంటూ అమ్మని, నన్ను వదలి నిర్దాక్షిణ్యంగా ఊరు విడచి వెళ్ళిన నాడు అమ్మని ఊరడిస్తూ కల్లబొల్లి కబుర్లు చెప్పి నమ్మించిన ఈ మనుష్యులేనా, ఈనాడు నిస్సహాయురాలైన నన్ను చూసి ఎన్నెన్నో విధాల అవమాన పరుస్తున్నారు...? ఒంటరియైన ఆడదాన్నిచూస్తే మంచి మనసుతో చేయూతనిచ్చి, మంచి త్రోవలోకి నడిపించాల్సింది పోయి, తమ స్వార్థానికి ఆటబొమ్మగా ఉపయోగించ దలచినవారు కొందరైతే, మరికొందరు చిలవలుపలవలు చేర్చి గోరంతలు కొండంతలు చేసి అంతఃకలహాలు లేవదీస్తారు. వీరివల్ల అర్థంలేని అనుమానాలతో తన ప్రవర్తనకి, పరధ్యానానికి వెనక నిన్ని పరుసలు ఏర్పడి నిందలు మోపినా తను అత్తగారింట్లో అనుకుంటున్నట్టు జాలి పొందడమే కాని వారి ఎదుట పన్నెత్తి మాటైనా మాట్లాడదే కాదు. ఏనా, తనువారికి బరువు. తన భర్త పరాయి లయిపోవడానికి తను కారకురాలెలా అవుతుందో, తన ప్రమేయం అందులో ఎంత వరకు ఉన్నదో తనకి ఒక్కరికే తెలుసు. కాని, తన పాదమహిమలో మొదట్నుంచి అనర్థాలనే ఆరోపిస్తున్న నాన్న, అత్తమామల మూఢవిశ్వాసాల ముందు తనెంత...తన వ్యక్తిత్వం ఎంత?

పదేళ్ళయింది, తన భర్త జాడతెలిసి. అత్తమామలు అదే బెంగతో కృశించి పోయి, మనోవ్యాధితో మూలుగుతున్నారు. ఆ వ్యథ, బెంగ తను వారికంట పడ్డప్పుడే, వారికి గుర్తొస్తుంది. తన మానాన తను వంటింట్లో పనిచేసుకొంటూనో, పెరట్లో అంట్లు తోముకొంటూనో, అత్తమామలు పైవారి సంగతులు చర్చించుకొంటూరే కాని, కొడుకు ఊసెత్తరు. పొరపాటున తను ఎదురుపడితే, కళ్ళు ఒత్తుకొంటూ మామగారు, ముక్కుచీదుతూ అత్తగారు అక్కసంతా మాటల రూపంలో వెళ్ళగ్రక్కుతూంటారు. మొదట్లో తనూ వాళ్ళతో కల్సి ఏడ్చేది. తర్వాత తర్వాత మనుష్యుల తత్వాల్ని అర్థం చేసుకొన్నాక, తన కళ్ళల్లో నీరు ఇంకిపోయింది.

అమ్మతప్ప ప్రపంచంలో తనకు కావల్సిన వాళ్ళూ, తనను కోరుకునే వారు లేనందువల్ల, ఒకరిబాధలో మరొకరు భాగం పంచుకొని, ఊరడింపుద్వారానైనా కొంత ఉపశమనం కల్గించేవారు లేనందువల్ల, మనిషికోసం మరొకమనిషి కన్నీరు నింపుకునే టంత సహృదయు లెవరూ ఇంతవరకు తడసపడ లేనందువల్ల, పైగా లోకోద్ధారకుల మనే పేరుతో లేనిపోని నిందలను అమాయకులపై అంటగట్టి చివరికి తమ దారిన తాము పోయేవారి నందర్నీ కళ్ళారా చూస్తూ వారి వారి ఆరోపణలను, నిందలనూ, అవమానాలనూ, అవహేళనలనూ అన్నిటినీ సహనంగా భరించడం తన కలవాటై పోయింది. భరించలేని బాధని భరిస్తూ, నిర్వికారత నలవరచుకొన్న మనస్సే తనకు దేవుడిచ్చిన వరం!

ఈ ఆలోచనల కంతు చిక్కకుండా ఉంది కామాక్షికి. బ్రతుకు దుర్భరంగా, భవిష్యత్తు కూడా గతంలాగే అంధకారంగా భయపెడ్తోంది. ఎడతెగని ఆలోచనల్ని జయించలేక మనసు ఇంకా ఇంకా ముందుకు సాగిపోతోంది. అర్ధరాత్రి దాటినా, పరిసరాల ఉనికి తనకేమీ తెలియడంలేదు. తన మనసులో ఉన్నదల్లా ఒకటే ఆలోచన. ఇంతవరకు తన జీవితం ఎలా గడిచింది, ఇకముందు ఎలా గడుస్తుంది, అసలు జీవించి, వీరి కుటిలత్వానికి, రాక్షసత్వానికి తాను బలిపశువుగా బలిసీతంమీద ఎందుకు నిలబడాలి? బ్రతుకుబాట తానింక మార్చుకో లేదు. మార్చుకోను, కాని, ఇదేవిధంగా తను బ్రతుకుని ఈడ్చలేదు.

అసలు తను ఎవరికోసం బ్రతకాలి, ఎందుకోసం బ్రతకాలి...? ముసుముసు భవిష్యత్తులో ఎప్పుడో దైవం దయతలచి, తనభర్త తన దగ్గరకు వస్తాడని, తానిన్నాళ్ళా చేసిన తప్పుకు బాధపడి, తనను సమయానికివచ్చి ఆదుకొంటాడనీ, తనను ప్రాణప్రదంగా చూసుకొంటాడని తన కే కోరిక లేదు. ఇది వరకు ఉన్నా, ఆ ఆశకూడ కొన్నేళ్ళ క్రిందటే సమూలంగా పెకలించ వేయబడింది.

అత్తమామలు తమ కొడుకుకోసం బెంగపెట్టుకొన్నా, తన భర్తమీద తనకే మాత్రం బెంగ ఏనాడూ కలగలేదు. నీళ్ళ అపోహకాని, ఆయనగారు ఏదూర దేశాలకో చదువు కోసమో, ఉద్యోగం కోసమో వెళ్ళి, అక్కడే పెళ్ళిచేసుకొని స్థిరపడి పోయుంటారు. ఆనాడు తన రెండెకరాలకోసం తాపత్రయపడిన మామ గారిమాట కాదనలేక తన మెళ్ళో, మూడు ముళ్ళూ వేసి ఉంటాడు. ఇది కేవలం తన అపోహ మాత్రమే కాదు, రెండు మూడుసార్లు అత్తగారి చాటున లమ్మలక్కలు తన నాడుతూన్న మాటిపోటి మాటలలో గుంభనంగా ఉన్న అర్థం ఇదే! అది నిజమైనా తనకే బాధకలగదు. సంసారేచ్ఛ తన కేనాడూ లేదు. ఇది అత్తగారి చెవిన పడితే ఆవిడ చాలా సంతోషించి ఉండేది. కాని ఆవిడ ఎదుట సాహసించి ఎవరూ మాట్లాడలేరు.

కామాక్షి ఆలోచనలు మళ్ళీ మొదటికి వచ్చి, ఉగ్రరూపం దాల్చి మనసు ఉద్రేకంతో ఊగిపోతోంది. 'పిల్లేడు మునూమ్మటికే ఏల్లేదు ఇన్నాళ్ళూ తను తల్లి తృప్తికోసం ధైర్యంతో ప్రాణాలను నిల్పుకొంది. తనవల్లకూడ తల్లి దుఃఖపడుతూంటే తన బ్రతుకే వ్యర్థం. తనకి పుట్టినప్పటినుంచి సుఖమంటేనే తెలియదు. అటు అని విలువైనా కష్టాలవల్ల దుఃఖం ప్రాప్తించినా, ఆ దుఃఖాన్ని నిండిన బండమైపోయింది అనుభవించిన మనసు. అందుకే దాన్ని కరగింప గలదేమో కాని కరుడుకట్టిన తన కళ్ళనుండి వెచ్చని నీటిబొట్టును రప్పించలేదు. ఇరవై ఏళ్ళ జీవితం లోను ఏ సంఘటనకూడా తన మనస్సును కదల్చలేక పోయింది. మనసు మొద్దు

బారి; శరీరం దినచర్యకి ఇంటిసేవకి అంకితమై ప్రాణంఉన్న శిలాప్రతిమ అయింది తను. ఎంత చాకిరీచేసినా అల సటలేని శరీరం, ఎన్ని అవమానాలను భరిస్తున్నా మొద్దుబారిన మనసుతో ఇన్నేళ్ళు గడిపినా, క్రితంరోజు రాత్రి నిద్రరాక ఇలానే ఏవేవో ఆలోచనలతో సతమతమౌతూన్న తనకు పెరటివైపుగా ఉన్న ఊరి రచ్చబండమీద పెద్దలు తన విషయమై మాట్లాడుతున్న ప్రతిపా దన గుండెల్లో సూదిగా గుచ్చుకొని మన సును వెలికి లాగి ఆ ప్రతిపాదనలోని ప్రతి అక్షరం పదునైన బాకులాగా మన సంతా గాయాలతో చిత్రవధ చేసిన బాధ వెయ్యిజన్మల బాధంతటిది. ఆ క్షణాన్నుండి మనసు శోకాగ్ని విచిత్ర విభ్రమమైన ఆలోచనలతో ఏవేవో లోకా ల్లోకి తీసుకు పోయింది తనను.

ఇంకా ఈ ప్రతిపాదన ఇంటివారిలో ముఖ్యులందరికే తెలిసి ఉండదు. తెల్లవారే టప్పటికి మామగారు ఇంట్లో ఒక పెను తుఫాను సృష్టించి ఉండేవారు. మంచి కాని చెడుకాని ఒక ఆలోచన బయటి లోకి వచ్చిందంటే దానిఅంతు తేల్చేవరకు వారికి ఉండబట్టదు. అందులోను, భర్త సజీవంగా ఉన్నాడో లేదోకూడ తెలియ, ఇన్నాళ్ళా భర్త వదలివేసిన అనాధగా చూడబడుతూన్న తను పదిహేనేళ్ళు దాటినా భర్తజాడ తెలియనందువల్ల శ్రేయోభిలాషులమంటూ చేసిన ప్రతి పాదన, అదే, తనను సుమంగళిగ చూడ లేని పెద్ద మనుష్యులమంటూ మొసలి కన్నీళ్ళను విడుస్తున్నారు. అంత కన్న వారు చెయ్యగలిగిందేముంది?

అత్తగారికి ఒంట్లో అస్వస్థతగా ఉన్నరోజుల్లో ఆమె ఆజ్ఞ ప్రకారం ఎదురుగానే ఉన్న కోనేటికి వెళ్ళి బిందెతో నీళ్ళు మోసుకువచ్చినన్ని రోజులు గుటకలువేస్తూ, చూపులతోనే కాల్చేస్తూ, ఏమీ పనిలేకపోయినా ఆమే పవార్లు చేసిన కరణంగారి కొడుకే తన ఆట సాగనందువల్ల, తన శ్రేయస్సు కోరే పెద్దమనుష్యులలో ఒకడయ్యాడు.

దూరంనుండి ఉండిఉండి పెనువు ఉరుములు వినిపిస్తున్నాయి ఆకాశంలో మబ్బులు మిణుకు మిణుకు మంటు న్నాయి. వాతావరణం భయంకరమైన ప్రశాంతతతో, నిశ్శబ్దంగా ఉంది. మొండి ధైర్యంతో, పెడత్రోవమీద నిర్లక్ష్యమైన చిరునవ్వుతో లేచి నిల్చుంది కామాక్షి. ఎడిపోతున్న జుత్తును కసిగా ముడివేస్తూ తన సర్వం చేసుకోలేని మనుష్యుల్ని, సహృదయతతో సాటి మనిషిగా సాను భూతి, కరుణ చూపించలేని మనుష్యుల్ని, మనుష్యుల అశక్తతను అమాయకతను వారి స్వలాభాల కపేక్షిస్తూ ఎత్తుకు పై ఎత్తువేసి స్వార్ధంతో నిండిన హృద యాలతో జీవిత చదరంగంలో పావులుగా నడిపించి, మర్మంచేస్తున్న మోసగాం డ్రను, అర్ధంలేని ఆచారాలకు, అనుమా నాలకు అవకాశాలిచ్చి, మూఢ నమ్మకా లను ఆక్రోశించి, ద్వేషించిన మను ష్యుల్ని వదలి, నిర్భయమైన నిశీధిలో, భయంకరమైన ఆవేశంలో ఉరకలు పరు గులు పెడుతూ, సుఖదుఃఖాలు రెండిం టినీ సమానంగా భరిస్తూ నిత్య నిర్మ లంగా మెరుపుల తరుగుతూ సంతోషంతో పరుగుతో ప్రవహిస్తున్న ఏటి చివర వాగుతేటిలోకి నడక సాగించింది. క్రౌర్యా నికి మారుపైన ఎర్రని పసుపు రంగుతో, అంతులేని ఆవేశంతో సము ద్రునితో పొందాలికై ప్రయాణం సాగిస్తున్న వాగుతేటివాగు సముద్రోత్సా హంతో ఆ మా క్షి ని ఆహ్వానించింది తనలో ఏకం చేసుకొంది.

ఆకాశంలో మెరుపు మెరిసింది. ఒక చుక్క వెలిగింది. ఉరుమువేసి మేఘం గర్జించింది. చుక్కలేదు, మొక్క వెయగా లేదు ●


# ఆల్బో-సాంగ్

అన్ని వయసుల
వారికి ఆదర్శక బలవర్ధకం

మీరు అన్నివిధాల ఆరోగ్యంగా వుండాలంటే మీకు ఆల్బో-సాంగ్ అవసరం. వృద్ధులకు, యువకులకు కూడా పటిష్టమైన శరీరాన్ని ఆరోగ్యాన్ని సంపాదించుటకు ప్రత్యేకమైన పదార్ధాలు ఆల్బో-సాంగ్‌లో చేర్చబడ్డాయి. ఈ రోజు ప్రతిరోజూ కూడా ఆల్బో-సాంగ్ తీసుకోండి-సర్వదా మీరు ఆరోగ్యంగా వుంటారు






జె. అండ్ జె. డీఛేన్
హైదరాబాదు (దక్కన్).